క్లుప్తంగా

మ్యాట్ ల్యాబ్ వినియోగంపై శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురువారం మ్యాట్ ల్యాబ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలకు మ్యాట్ ల్యాబ్ వినియోగం బాగా ఉపయోగపడుతుందన్నారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి సుమారు వంద మంది వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరయ్యారన్నారు. విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డి.సంజీవ్ కుమార్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీఎస్ రామమూర్తి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఎ.అన్నపూర్ణ, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎ.రాజేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మల దత్తు

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు పిలుపు ఇచ్చారు. భారతీయ జనతా పార్టీ సంఘటన పర్వ్ 2024లో భాగంగా గురువారం కంబాలచెరువు సమీపంలోని అశోక కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. బీజేపీ ఏడవ మండల అధ్యక్షుడు తంగెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బూత్ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి యానాపు ఏసు మాట్లాడుతూ బూత్ నియామక ప్రక్రియ విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర శ్యామ్ బాబు, మజ్జి శివ ప్రసాద్, తంగెళ్ల పద్మావతితదితరులు పాల్గొన్నారు. బీజేపీ క్రియాశీలక సభ్యులకు బొమ్మల దత్తు సభ్యత్వ రశీదులు అందించారు.

నర్సరీ సందర్శన



రమణ దీక్షితులుకు స్వాగతం పలుకుతున్న పోలరాజు తదితరులు

కడియం: కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని టీటీడీ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు గురువారం సందర్శించారు. ముందుగా ఆయనకు నర్సరీ అధినేత, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : మెకానిక్ రాకీ
సూర్యమినీ : క
సూర్యప్యాలెస్ : మెకానిక్ రాకీ
శివజ్యోతి : జీబ్రా
అనుశ్రీ : దేవకి నందన వాసుదేవ
స్వామి : అమరన్
అశోక : లక్కీ భాస్కర్
రాజా : క
రంభ : మందిర
ఊర్వశి : కంగువా
మేనక : కేశవ చంద్ర రమావత్
కుమారి : జీబ్రా
అప్సర : మట్కా, లక్కీ భాస్కర్

నామవరం
వీఎస్ మహల్ : మెకానిక్ రాకీ

ధవళేశ్వరం
మురళీకృష్ణ : జీబ్రా

కడియం
వెంకటసూర్య : మెకానిక్ రాకీ

ప్రతి క్షణం.. అప్రమత్తం..

- ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు
- భక్తులకు సూచనలు
- నదిలో లోతుకు వెళ్లకుండా పహారా
- జేబుదొంగలపై నిఘా



పుష్కరాల రేవులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కంబాలచెరువు: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా అంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో దేవాలయాలు కిటకిటలాడుతున్నాయి. శివకేశవుల ఆలయాలకు భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. నిత్యం పూజలు, హోమాలు, అభిషేకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఘాట్లలో పుణ్యస్నానాల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కిటకిటలాడుతున్న ఘాట్లు

కార్తిక మాసంలో గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. స్నానాల అనంతరం సమీపంలోని దేవాలయాలను దర్శించుకుంటున్నారు. నగరంలోని పుష్కరాల రేవు, కోటిలింగాల ఘాట్లు ప్రతి సోమవారం తెల్లవారుజామునుంచే కిక్కిరిసిపోతున్నాయి. మిగిలిన రోజుల్లో కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కార్తిక స్నానాలు ఆచరించే భక్తులు, అయ్యప్ప మాలధారులతో సందడి నెలకొంటోంది. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల రాక కొనసాగుతూనే ఉంటోంది.

పోలీసుల బందోబస్తు

భక్తుల రద్దీ నేపథ్యంలో ఘాట్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. వీరందరూ ఘాట్లను పర్యవేక్షిస్తున్నారు. గోదావరిలో స్నానాలకు దిగే భక్తులకు జాగ్రత్తలు చెబుతున్నారు. ఘాట్లలో భక్తులు క్రమశిక్షణతో మెలిగేలా, తోటి వారికి ఇబ్బంది కలిగించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే జేబుదొంగలు, ఆకతాయిలపై నిఘా పెడుతున్నారు. వారి వల్ల భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కార్తిక స్నానాలు చేసేటప్పుడు, దీపాలను నదిలో వదిలేటప్పుడు భక్తులు నిబంధనలు పాటించాలి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నచోటుకు, లోతు ప్రాంతాలకు వెళ్లకూడదు. గోదావరి రేవులు, నదీ తీర ప్రాంతాలు, కాలువలు, చెరువుల్లో పుణ్యస్నానాల కోసం దిగేటప్పుడు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గమనించాలి. పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని వెళ్లితే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. రాజమహేంద్రవరంలోని ఘాట్లలో స్నానాలు చేసేటప్పుడు లోతు ప్రాంతాలకు వెళ్లకూడదు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే కంట్రోల్ రూమ్ 0883 2441480, 112 నంబర్లను ఫోన్ చేయవచ్చు.

నిత్యం గస్తీ

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కోటిలింగాల ఘాట్, పుష్కర ఘాట్, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మార్కండేయేశ్వర స్వామి ఘాట్, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గౌతమీ ఘాట్, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో రామపాదాల రేవు ఉన్నాయి. ఈ రేవుల వద్ద పోలీసులు నిత్యం గస్తీ కాస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గోదావరి, చెరువుల్లో స్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలి. లోతైన ప్రాంతాలకు వెళ్లకూడదు. అలాగే రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు ఉండే అవకాశం ఉంది. గోదావరి ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. పోలీసుల సూచనలు, నిబంధనలను భక్తులు తప్పకుండా పాటించాలి.

– వి.అప్పారావు, సీఐ,
మూడో పట్టణ పోలీస్ స్టేషన్,
రాజమహేంద్రవరం.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- గోరక్షణ పేట, తాడితోట మార్కెట్ ఏరియాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ ఉండదు.
- రామచంద్రపేట, కోర్లంపేట, సాంబశివరావు పేట, తుమ్మలోవలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తారు.
- ఆర్యాపురం, కార్పొరేషన్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయం, లక్ష్మీవారపుపేట, గోకవరం బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ కలిగే అంతరాయం కలుగుతుంది.
- శ్రీరామ్‌నగర్, రాజీవ్ గాంధీ కాలేజీ ఏరియా, పేపరుమిల్లు ఏరియా, సాయిబాబా గుడి, దుర్గానగర్, మల్లయ్యపేటలలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ, సింహాచల నగర్ ఏరియాలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ నిలిపివేస్తారు.
- నగరంలోని టౌన్ హాల్ రోడ్డు, సెంట్రల్ విజటబుల్ మార్కెట్, సూరాబత్తులవారి వీధి, వంకాయల వారి వీధి, గీతా భవనం, వీరేశలింగం ఇంటి ఏరియా, అష్టలక్ష్మి గుడి వీధి, మెయిన్ రోడ్డులలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ సరఫరా ఆగిపోతుంది.
- ధవళేశ్వరం గ్రామం, అగ్రహారం, బ్యారేజ్ క్వాటర్లు, క్వారీ కెనాల్ రోడ్డు, శేఖర్ థియేటర్ రోడ్డు, ఎర్రకొండ, బత్తిన సుబ్బారావు కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, ఎనోసాల్ట్ కంపెనీ, మంతెన సత్యనారాయణ ఆశ్రమం, ఎన్‌హెచ్ రోడ్డు, టీవీఎస్ ఏరియాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం కలుగుతుంది.
- సింహాచల్ నగర్, రామదాసుపేట, సున్నం బట్టి రోడ్డు, వితంతువు కాలనీ, చర్చి కాలనీ, రాజరాజేశ్వరి నగర్, కొత్తమూరు మెయిన్ రోడ్డు, వీసీ కాలనీ, నూకాలమ్మ గుడి ఏరియా, ఎస్ఎస్ఆర్ఆర్ లేఅవుట్‌లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ ఉండదు.

భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి



బొమ్మూరు పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

- ఎస్పీ నరసింహ కిశోర్
- బొమ్మూరు పోలీస్ స్టేషన్ తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ నేరాలు, మహిళా భద్రత, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. ఆయన గురువారం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి విషయాన్ని రికార్డులలో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషనకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలలు, హోటళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై ఉన్న ట్రాఫిక్ జంక్షన్లలో ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలు, స్పీడ్ కంట్రోల్ ట్రాఫిక్ బోర్డులు, పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటుచేయాలని అధికారులను ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోరంపూడి, పిడింగొయ్యి, జేఎన్ రోడ్డు, ఏపీ అప్పారావు రోడ్డు, లాలాచెరువు పాయింట్లను ట్రాఫిక్, లాఅండ్‌ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పరిశీలించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు ప్రణాళిక సిద్ధం చేశామని, దాని ప్రకారం తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్లు అనసూరి శ్రీనివాసరావు(ఎస్‌బీ), కాశీ విశ్వనాథ్ (బొమ్మూరు), జి.ఉమామహేశ్వరరావు(సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్), నబి, చింతా సూరిబాబు (ట్రాఫిక్), ఐటీ కోర్ ఎస్సై అయ్యప్పరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

స్త్రీ విద్యకు కందుకూరి ప్రాధాన్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రౌతు సూర్యప్రకాశరావు, చిత్రంలో ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: స్త్రీ విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమే గాక, వితంతు వివాహాలు జరిపించి మహిళాభ్యున్నతికి పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు కొనియాడారు. కందుకూరి వీరేశలింగం పుర మందిరం (టౌన్ హాల్) జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, జూబ్లీ లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వీరేశలింగం తన యావదాస్తిని ప్రజాప్రయోగం వినియోగించారన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాల రాయుడు, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, మాటూరి సిద్దార్థ, వీఎల్ పురం కల్చరల్ అసోసియేషన్ నరవ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అత్యాచారం ఘటనపై విద్యార్థినుల నిరసన



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి, విద్యార్థినులు

రాజమహేంద్రవరం సిటీ: విశాఖపట్నంలో లా విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రేమ, పెళ్లి పేరుతో విద్యార్థినిని మోసం చేసి, అత్యాచారం చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ) ఆర్.కృష్ణ నాయక్‌కు వినతి పత్రం అందించారు. ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరిహారం



బాధిత కుటుంబానికి పరిహారం చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ ఏడాది జూన్ 12న కువైట్ మాంగాఫ్ సూపర్ మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందగా, ఆ కుటుంబాలకు విదేశీ వ్యవహారాల శాఖ చొరవతో ఒక్కొక్కరికి రూ.12.64 లక్షల చొప్పున పరిహారం అందజేశారని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చామన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో బాధిత కుటుంబ సభ్యులకు రూ.12.64 లక్షల చొప్పున అందజేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన మృతుడు మీసాల ఈశ్వరుడు సతీమణి మీసాల చిట్టి కాసులుకు, ఖండవల్లికి చెందిన మృతుడు మొల్లేటి సత్యనారాయణ సతీమణి మొల్లేటి అనంతలక్ష్మిలకు పరిహారం ఇచ్చామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సహకారంతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యువతకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పోలీసు అధికారులు మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. వాహనచోదకులు తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌లు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వలన కలిగే దుష్ఫలితాలను వివరించారు. సదస్సులో ట్రాఫిక్ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కె.సుభాషిణీదేవి, డాక్టర్ బి.భవాని, సీహెచ్ పవన్, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ యూసఫ్ బాషా, డాక్టర్ కె.అనూష పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి తీవ్ర గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన గార సన్నీ నన్నయ క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి రహదారిపై నడిచి వెళుతున్న అతడిని పచ్చగడ్డి మోపులతో వెళుతున్న బైకు తగులుకోవడంతో కింద పడిపోయాడు. అదే సమయంలో కాకినాడ నుంచి తెలంగాణాకు వెళుతున్న లారీ అతడి ఎడమ కాలు ఎక్కేసింది. ఈ ప్రమాదంలో సన్నీ కాలు నుజ్జునుజ్జయ్యింది. అతడిని 108లో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, శాస్త్రవేత్తలు

కడియం: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల చెప్పిన మెళకువలు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని మురమండలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్టేరు పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన నూతన వరి వంగడం ఎంటీయూ 1426 ను పంపిణీ చేశారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా ఈ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ రకం విత్తనాలు 120 నుంచి 125 రోజుల్లో పక్వానికి వచ్చి హెక్టారుకు 6.5 నుంచి 7 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. అలాగే అగ్గి, ఎండాకు, ఉల్లికోడు తెగుళ్లతో పాటు దోమపోటును కూడా తట్టుకుంటుందన్నారు.

సార్వా కోతలు 50 శాతం పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ సార్వా వరి కోతలు సుమారు 50 శాతం వరకూ పూర్తయ్యాయని, దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రబీ నారుమడులు వేస్తున్నారన్నారు. శాస్త్రవేత్తల వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి దాళ్వాలో అధిక దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. అభ్యుదయ రైతులకు నూతన వరి రకం ఎంటీయూ 1426 చిరు సంచులను (మినీ కిట్స్) పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం మరిడి సత్యనారాయణ పొలంలో వరి పంటను పరిశీలించారు. మినుము పంటను పరిశీలించి బూడిద తెగులు ఉన్నట్లు గుర్తించారు. దాని నివారణకు కార్బెండజిమ్ ఒక గ్రాము లేదా థయోఫనేట్ మిథయిల్ ఒక గ్రాము లేదా ప్రొపికోనాజోలు ఒక మిల్లీలీటర్ లేదా డైఫెన్ కొనాజోల్ ఒక మిల్లీలీటర్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది జయరామలక్ష్మి, ద్వారకాదేవి, ఉద్యాన అధికారి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

జీవరాశిని కాపాడుకుంటేనే మనుగడ



గోదావరిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న రౌతు సూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రకృతి, జీవరాశిని కాపాడుకుంటేనే మానవ మనుగడ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం పద్మావతీ ఘాట్‌లో గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మంచాల బాబ్జీ, వైఎస్సార్ సీపీ నేత నక్కా శ్రీనగేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, దాసరి గురునాథం, వట్టికూటి వేణుచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదావరిలో చేప పిల్లలను విడుదల చేసి, నిరుపేద మత్స్యకారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మత్స్యకార సంఘ నేత వెలమ లక్ష్మణరావు మాట్లాడుతూ మత్స్యకార సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వనమాడి కొండబాబు, కొల్లు రవీంద్ర వంటి వారికి ఆ శాఖను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఇటీవల తమ వారిపై త్రీ టౌన్‌లో అక్రమ కేసులు పెడుతున్నారని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ర్యాంపుల కేటాయింపుల్లో మత్స్యకార సొసైటీలకు అవకాశం లేకుండా పోయిందన్నారు.

తమిళనాడులో న్యాయవాది హత్య దారుణం

కంబాలచెరువు: తమిళనాడులో న్యాయవాదిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ సొసైటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీర అరుణ్ కుమార్ అధ్యక్షతన గురువారం జిల్లా కోర్టు సమీపంలో ధర్నా చేశారు. సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం ఈ ఘటనను చాలా తీవ్రంగా పరిగణించాలని, న్యాయవాది కుటుంబాన్ని తక్షణం ఆదుకోవాలన్నారు. సహాయ కార్యదర్శి బీర అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైందని, ఇప్పటికైనా కేంద్రం అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఉపాధ్యక్షులు కాశి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులంతా రక్షణ చట్టం కోసం ఏకతాటి పైకి రావాలన్నారు. నిరసనలో కొత్తపల్లి శ్రీనివాస్, కేఎస్‌వీ బాబు, ధర్మ, కుంచె రాంబాబు, పీఎల్ నాగేశ్వరరావు, గున్న సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

ప్రకాశం నగర్: ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దని, విద్యుత్ ట్రూ అప్ చార్జీల అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గోదావరి గట్టున ఉన్న ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే ప్రభుత్వం నిలుపుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే సుమారు రూ.13 వేలను 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచే వసూలు చేస్తారని చెప్పారు. ఇప్పటికే రూ.17 వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారం వేస్తున్నారని, మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో వి.కొండలరావు, పి.తులసి, కె.రామకృష్ణ, ఎస్.రాజా పాల్గొన్నారు.

రాజానగరంలో ఆధ్యాత్మిక శోభ

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం గాయత్రీ హోమం, అన్న సమారాధన వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఇచ్చిన కాకడ హారతి అనంతరం వినాయకుడు, దత్తాత్రేయుడు, సరస్వతీమాత విగ్రహాలతో పాటు సాయిబాబా మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజ్యనీయులు రామానంద స్వామి శిష్యపరివారం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటుచేసి, 44 జంటలతో గాయత్రీ హోమాన్ని నిర్వహించి, పూర్ణాహుతిని సమర్పించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఐఎస్‌టీఎస్ చైర్మన్ ఉపేంద్ర రెడ్డి, తహసీల్దారు లక్ష్మీ లావణ్య, ఐఎస్‌టీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి, సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్‌తో పాటు రాజానగరం, రంగంపేట, రాజమహేంద్రవరం, కోరుకొండ, గండేపల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గాయత్రీ హోమాన్ని సందర్శించి, సాయిబాబాను దర్శించి, అన్న సమారాధనలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దివ్య, గైట్ విద్యార్థులు సేవలు అందించారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ

సాయిబాబా ఆలయంలో స్థానిక రైతు నీలపాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేసిన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలువురు తమ సెల్‌ఫోన్‌లలో ఆ అలంకరణను ఫొటోలు, వీడియోలు తీసి భద్రపర్చుకున్నారు.